# బహుపరాక్!

కె.కె. రఘునందన



**నా మొహంలో అలుముకున్న చీకటి.**

**వాకిట్లో ఎదురుచూస్తున్న శ్రీమతి రాణి ధృక్కులు నా చూపులపై తారట్లాడాయి.**

**గుంజాటనతో నలుగుతున్న గుండెల్లోకి తొంగి చూసింది.**

"ఈ ఉత్తరం చదువు. పోస్ట్‌లో వచ్చిన ఉత్తరాన్ని అందుకుంది రాణి. కన్నీటితో అలుక్కుపోతున్న అక్షరాల్లోకి చూసింది, భోరుమన్నది.

బాల్యంలో తప్పటడుగులు వేస్తే ముద్దులొలుకుతున్నాయని ఒడలు పులకరిస్తుంది.

అదే యవ్వనంలో తప్పటడుగు వేస్తే వెన్ను జలదరిస్తుంది. కన్నవారిని కష్టపెట్టకూడదన్న జ్ఞానం లేని వయసులో తప్పు త్రోవలో ప్రస్థానం.

గేటు చప్పుడు.

"అదిగోనండీ మన ముద్దుల మౌనిక" కంగారు, నిరీక్షణల కలగలుపు గొంతుతో అన్నది రాణి.

"కళ్ళజోడు పెట్టుకు చూడు" అన్నాను.

ఆమె ఆశ ఓ ఎండమావి.. వస్తున్నది అర్చన..

"అంటే మౌనిక ఏదీ? స్టడీ సెంటర్‌కి డుమ్మా కొట్టేస్తుందా ఈ వేళ" కిలకిలమంటూ లోనికి వస్తున్న అర్చనను ఆపి "లేదమ్మా మౌనికకు ఫీవర్‌గా ఉంటేనూ" అన్నాను.

"అయ్యో పాపం! ఏదీ ఓసారి చూస్తాను" గదిలోకి చనువుగా దూరబోయింది.

ఆ పిల్లను పంపేసినప్పటికీ ఈ బెంగ తీరిపోయిందీ అనటానికి వీల్లేదు. ఈ గుంజాటన ఇప్పుడే ప్రారంభమైంది.

ఇలాగే ఎందరో వస్తారు. ప్రశ్నలేస్తారు. ఆరాలు తీస్తారు. వ్యాఖ్యానాలు చేస్తారు. విమర్శిస్తారు.

గండి కొట్టి పారిన ఏటికి, నోరు కట్టని లోకం కూసిన కూతకి తీరుతెన్ను ఉండవు.

తమ బిడ్డ గీసిన పిచ్చి గీతను చూసి ఎవరెవరు పెడర్థాలు తీసినా చూసుకోవాల్సిందీ గాయపడాల్సిందీ తామే.

"నాకు నచ్చినవాడితో నేను వెళ్ళిపోతున్నా. నా కోసం ఎటువంటి ప్రయత్నం చేయొద్దు. అలా చేస్తే నా శవమే చూస్తారు" మీకు ఏమీ కాని మౌనిక.

ఒకటికి పదిసార్లు చదివినా అవే వాక్యాలు శూలాలై గుండెను శకలాలు చేస్తూ..

చివరి వాక్యమొక్కటి చాలు బాధా పరితప్తులను చేయటానికి. నవమాసాలు మోసిన తల్లిగా రాణి, ముద్దు మురిపాలను రంగరించి తేనె ఊటల్లో ముంచి శైశవ బాల్య దశలను రంగరంగ వైభవంగా జరిపించి అడిగిందే తడవుగా కోర్కెలు తీర్చే కల్పతరువుల్లా సాక్షాత్కరించి పద్దెనిమిదేళ్ళ యవ్వన ప్రాయాన్ని ప్రసాదించిన తల్లిదండ్రులకు తనేమీ కానన్న ఒక్కమాటతో.. ఛ..

సంపూర్ణ వ్యక్తిత్వం సంభవించని స్థితి నిర్ధారితమౌతూనే ఉన్నప్పటికీ...

ఆ మాటకు గుండెలు బ్రద్దలైపోవూ!

మాకది కఠిన పరీక్షే.

మౌనికకు ఏమైంది? ఏం లోటు చేశాం? ముద్దు చేయటమే మా లోపమా?

మగపిల్లల్లేరని ఆమెనే ఓ మగాడిగా భావించాం.

మౌనిక అందచందాలు, అపురూపం, అంతంతలేసి కళ్ళతో అత్యంత మనోహరంగా దుమికే జలపాతంలా, సాగే ఝరిలా ఉండేది.

ప్రోది చేసుకున్న మా ఆశలు, ఆశయాలు కూలద్రోయటానికి మౌనిక ఓ తీపి పూసిన విష గుళికలా, తేనె పూసిన కత్తిలా అయిందా? అయ్యో! ఎంత అజ్ఞానంతో ఈ పని చేసింది? తనకు నచ్చినవాడంది తప్ప, ఎటువంటి వాడో రాయలేదు.

తమతో ఓ ముక్క చెబితే... ఆ చెబితే? తను ఓ కుర్రాడితో వెళ్ళిపోతానని నోటి మాటగా చెబితే తల్లిదండ్రులుగా తాము అంగీకరించి పంపగలరా?

అందుకే చెప్పాపెట్టకుండా ఓ కాగితం ముక్క పడేసి పారిపోయింది.

ఇంతకాలం సినిమాలన్నా, షికార్లన్నా, పిక్నిక్‌లన్నా, పార్టీలన్నా.. దేనికీ కాదనలేదు. ఈ విషయంలో మాత్రం మేం ఎక్కడ వ్యతిరేకిస్తామనో అన్న ఒక్క భయంతోటే ధైర్యం చేసి పారిపోయింది.

ఈ సమయంలో మౌనిక ఎక్కడుందో, ఎలా ఉన్నదో, తిన్నదో, లేదో.. ప్చ్...

రాణి నేను ఒకరి మొహాల్లోకి ఒకరం చూస్తున్నాం..

ఏమాత్రం ఊహకు తావునీయని విధంగా మౌనిక ఇంత నిష్కర్షగా.. అందరూ ఉన్నా ఎవరూ లేనట్లుగా ఎవడినో గుడ్డిగా నమ్మి మా ఆశలను కాలరాచి వెళ్ళిపోయిందే.. అదే అదే మేం భరించలేకపోతున్నాం.

తెల్లారేదాకా అదే స్థితి.

బయట మా కాలనీ పిల్లలు..


"మౌనికా! కమాన్ త్వరగా రావాలి. ఇంకా మొద్దు నిద్రా" అరుస్తున్నారు.

కిటికీలోంచి చూసి "ఒంట్లో బాగులేదమ్మా మీరు వెళ్ళండి" అని చెప్పి పంపేశాను.

నిప్పుపై ఎంతకప్పినా సెగ రాదూ!? మండే సూర్యుడిని ఎంతకాలం కారుమబ్బులాపగలవు?

## స్పర్శ

రోడ్డెక్కి అందాలు అల్లాడుతున్నాయి
రొమాన్సు దొరక్క
దొరికినా కిక్కెక్కక
ఇరుకు కూపాలలో కుక్కుకపోయి
మత్తిలుతున్నాయి
అంతా వూడ్చుకపోయాకా గ్లోబల్ రెక్క
శృంగారం స్పర్శ ఎండమావి
ఎండిపోతున్న కండోముల సాక్షిగా
ఇప్పుడు సరసభావన మూగజీవి
మోజులు మితిమీరి
వెబ్బుల్లో పబ్బుల్లో నైటు క్లబ్బుల్లో
మందూ పొందూ విందై



మహమ్మారుల ముందు మోకరిల్లాయి
సంస్కృతికి లెప్రసీ సోకి
మానవ అనుభూతి స్పర్శకి దొరకకుండా
పోయింది!

*- బి. వెంకటరవి*

ఏనాటికైనా భళ్ళున తెల్లారకా పోదు. ఫెళ్ళున ఎండెక్కకా పోదు.

వాకిలి చిమ్మి కల్లాపి జల్లి ముగ్గుపెట్టి లోనికి వచ్చిన పనిమనిషి గున్నమ్మ "అమ్మగోరూ! మౌని కమ్మగోరు అలికిడి నేదేటి, బయట బండీ నేదేటి" శోధిస్తూ అడిగింది.

"బండిమీద బయటకెళ్ళింది" రాణి గొంతులో కొద్దిపాటి విసుగు బయటపడక తప్పలేదు.

వెలుగు విరజిమ్ముతున్నకొద్దీ భయంకర మైన చీకటి కమ్ముకోసాగింది.

ఇంక రాబోయేవారిని, వారడిగే ప్రశ్నల వర్షాన్ని తలుచుకుంటే గుండెల్లో రైళ్ళు పరుగెడ్తున్నాయి.

ఏదో చెప్పి ఎంతకాలమిలా మసిపూసి మారేడుకాయను చేయటం? వెతుకుదామంటే లోకమంతా పొక్కిపోతుందన్న భయం ఓ పక్క పీడిస్తుంటే.. మౌనిక చేసిన హెచ్చరిక మరోవైపు భీతి గొల్పుతోంది. నేనాఫీసుకి వెళ్ళలేదు. యూనియన్లు పనులు పక్కకి పెట్టక తప్పలేదు. రాణి తనూ ఆఫీసుకి సెలవు పడేసింది. మహిళామండళ్ళు, మీటింగులు రద్దు చేసుకుంది.

ఇద్దరికీ ఫోన్లొస్తున్నాయి. ఆ బాధలోనే జవాబీయక తప్పని స్థితి.

మౌనిక కోసం ఎవరెవరో వస్తున్నారు.

కంప్యూటర్‌కి వెళ్ళిందనో, ట్యూషన్‌కి వెళ్ళిందనో చెప్పి పంపేసేది రాణి.

చెప్పినవాటిల్లో అతకని ఏదో వెలితి స్పష్టంగా కల్పించేది. అందరి దృష్టి మౌనిక ఉనికి మీదనే.

ఏం చెప్పాలో కంటే ఏం చెప్పకూడదోనన్న అగమ్యం.. మా మల్లగుల్లాలు కనిపెట్టేస్తారేమోనన్న భయం . ఎవరైనా అలికిడైతే కళ్ళు తుడుచుకుని మామూలుగా ఉండలేక ఉంటున్నాం.. ఇదీ మా పరిస్థితి.

చిట్టచివరికి మేం అందరకీ చెప్పిన పచ్చి అబద్ధం సింహాచలంలో చుట్టాలింటికి పంపామని.

ఆ సాయంత్రం కాబోలు బయటకు చూసినప్పుడు బోసుబాబు కుక్కను తీసుకుని వెళుతూ కనిపించాడు.

ఆయన్ను చూడగానే తటాలున మాకో విషయం జ్ఞప్తికి వచ్చింది. బోసుబాబుకు ఒక్కగానొక్క కూతురు కిన్నెర. సరిగ్గా ఆర్నెల్ల క్రితం కాలేజీ నుండి అట్నుంచటే ఎవడితోనో పారిపోయింది.

అయితే బోసుబాబుకు తమలాంటి పిరికితనం లేదు. ఓ వైపు గుడ్ల నీరు కుక్కుకుంటూనే గాలించాడు. నెలదాకా ఎటువంటి పత్తా లేదు. ఏమైనారో తెలీదు. అక్కడా ఇక్కడా కిన్నెర కనిపించిందనీ చూసినవారెవరో చెపుతుండేవారట.

ఇదివరలో ఇచ్చిన రిపోర్టు మీద పోలీసులు కూడా తీవ్రంగానే గాలించారు.

అంతకంటే త్వరితంగా కిన్నెర ఎవడితోనో లేచిపోయిందన్న వార్త కూడా పొగలా అల్లుకుపోయింది. బరితెగించిందన్నారు.

చివరికి మరో నెల తరువాత ఓ కుర్రాడి చేత మెడలో తాళి కట్టించుకుని పోలీసు ప్రొటెక్షన్‌తో ఇల్లు చేరింది కిన్నెర. తాడు బొంగరం లేని ఓ భట్రాజమానం అల్లుడిగా దాపురించినా భరించక తప్పలేదు. మింగలేక, కక్కలేక చివరికి ఇంట్లోనే పెట్టుకుని ఉపాధి చూపించాడు బోసుబాబు.

నిజానికి అదే పరిస్థితి తమకు ఎదురైతే? ఒకవేళ మౌనిక కూడా ఎవరో బడుద్ధాయి చేత తాళిబొట్టు కట్టించుకుని ఇంటి గడప తొక్కితే...

తాము అంగీకరించగలరా?

ఆ సంకుల సమరం తాము తట్టుకునే పరిస్థితిలో ఉన్నారా? సాంప్రదాయకమైన వివాహబంధానికి కట్టుబడతాము. కుటుంబ గౌరవం మంట గలిపిన మనువును ఆహ్వానించగలరా?

ఈ ఆలోచనల్లో ఉండగానే ఫోన్ మ్రోగింది. నిస్సత్తువుగా ఉన్నా రాణి తీసింది.. మాట్లాడింది.. ఆనక కన్నీళ్ళతో నన్ను చుట్టేసింది.

"మా అన్నయ్య రాత్రికి వస్తున్నాడండీ" అంటూ ఒణికిపోతూ చెప్పిందామాట.

మా బావ భవానీశంకరానికి ఒక్కడే కొడుకు దీపక్. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికాలో ఉద్యోగం. వాడు మౌనికను పూర్తిగా ఇష్టపడ్డాడు. ప్రదానం చేద్దామనుకుంటే అనుకోకుండా వాయిదా పడింది.

ఈ ఇరకాట స్థితిలో ముప్పిరిగొన్న ఆందోళనలో వున్న మేము అతని రాకను ఏమాత్రం భరించలేకపోతున్నాం.

చీకటిపడే సమయానికి భవానిశంకరం ప్రత్యక్షం.

"జియర్ కాంప్లెక్స్ దగ్గర ఆగి స్టడీ సెంటర్లో ఉందేమోనని ఓసారి చూశాను. నాలుగు రోజుల నుండి రాలేదని చెప్పారు. ఉంటే బండి మీద రావచ్చనుకున్నాను. మౌనికకి ఏమైందోనని ఒక్కటే గాబరాగా వచ్చాను" అని చేతి సంచి అందించాడు.

నేను రాణి మొహాలు చూసుకున్నాం.

"అదేంట్రా నిట్రాటల్లా ఉండిపోయారు. మౌనికేదీ? బయట బండి లేదేంటి? దిగ్భ్రాంతిగా అన్నాడు భవనీశంకరం.

"అదీ.. అదీ.." మాటలు నానబెట్టింది రాణి.

"మా మేనకోడలు నాతో హాస్యాలాడుతున్నదా ఏంటి?" అని లోనికి చూశాడు.

"అది సింహాచలంలో కులశేఖరంగారింట్లో అద్దెకుండే ఫ్రెండింటికెళ్ళింది. రేపో మాపో వస్తుంది" అన్నాను నేనే.

"ఎంత భయపడ్డాన్రా. మౌనిక లేకపోయేసరికి ఎంత వెలితిగా ఉంది. అది ఉన్నప్పుడే రావలసింది. అసల్నీకు దీపక్ బావంటే ఇష్టమా కాదాని అడిగేద్దును. నా వెర్రిగానీ దానిష్టమేంటిలే, పెద్దలు మీ ఇద్దరి మాట కొట్టేస్తుందా ఏంటి?" అని బాత్రూం వైపు వెళ్ళాడు భవానీశంకరం.

మాలో కొట్టొచ్చిన కలవరాన్ని ఎలా కప్పిపుచ్చాలో బోధపడలేదు.

"ఏమండీ మా అన్నయ్యతో" అనబోయింది రాణి.

"ష్" అన్నాను.

తిరిగి భోజనాల దగ్గరమౌనిక ప్రసక్తి తెచ్చాడు భవనీశంకరం.

"ఈ రోజుల్లో ఆడపిల్లలను చదువంటూ చంపుతాంగానీ పెళ్ళి చేసి పంపేయటమే నయం. ఉద్యోగస్తుడంటూ దొరికితే మాత్రం తాత్సారం చేయటం మంచిది కాదు. ఈ వేసవికైనా దీపక్‌తో మౌనికను ముడి పెట్టేస్తే.. కొంత భారం దిగిపోతుంది మనిద్దరికీ" అని పెళ్ళి విషయాలు మాట్లాడాడు.

మౌనిక గురించి అన్న ప్రతి మాటా చెర్నాకోలుతో ఛెళ్ళున చరుస్తూనే ఉన్నది.

తెల్లవారి సంచి చేతబట్టి బయటకు వెళ్ళేదాకా భవానీశంకరం బావ పీకమీదే కత్తిలానే తోచాడు.

అతనలా వెళ్ళటంతోనే అమాంతం మీద పడ్డ బాధతో బావురుమన్నాం. ఇలా ఎంతకాలం ఈ విష గుళికను నోట్లో పెట్టుకుని ఉమ్మకుండా మింగకుండా భరించటం?

ఈ అవస్థ పగవారిక్కూడా రాకూడదు.

అయిదు.. ఆరు.. ఏడు రోజులు.. గట్లు తెగ్గొట్టుకుంటూ పారే వరదనీటిలా కాలం పోతూ పోతూ వుంది.

"ఏంటి అంకుల్ మౌనిక ఇంతకాలం క్యాంప్ వేసింది?" అని ఎవరో ఒకరు రోజూ అడుగుతూనే ఉన్నారు.

*(మిగతా వచ్చే వారం)*